
# ఉభయ తారకం

శ్రీలతా సత్య

"మీరేనా ఈ పోర్షన్‌లోకి కొత్తగా వచ్చిందీ?" వెనుక నుంచి మాటలు వినబడి అల్మైరాలో పుస్తకాలు సర్దుతోన్న భార్గవ వెనక్కి తిరిగి చూశాడు.

ఓ అమ్మాయి అతడున్న గదిలోకి ప్రవేశిస్తూ "సామాన్లన్నీ అప్పుడే సర్దేశారే! మీరొచ్చి గంటేగా అయిందీ?!" అంది మళ్ళీ.



భార్గవ ఆ అమ్మాయిని తేరిపార చూశాడు. పదిహేడు, పద్దెనిమిదేళ్లుంటాయా అమ్మాయికి. లంగా ఓణీల్లో ఉంది. వంకీలు తిరిగిన జుట్టు ఆమె మొహానికి సరిగ్గా సరిపోయింది. కోలమొహం, చురుకైన పెద్ద కళ్ళూ, చిన్న నోరూ, ఎక్కడా వంపులేకుండా తిన్నగా ఉన్న నాసికా. 'అందమైనదే!' అనుకోకుండా ఉండలేక పోయాడు భార్గవ.

ఓ చేత్తో జడనటూ ఇటూ ఆడిస్తూ, "మిమ్మల్నే! నావైపు ఏవిటలా చూస్తున్నారూ? నా పేరు సమీర. మీ పేరేవిటీ?" అని, "మీ పేరేదైతే నాకెందుగ్గానీ, మీ ఆవిడ నెప్పుడు తీసుకొస్తున్నారూ?" అనడిగింది ఆ అమ్మాయి అతడి మొహంలోకి గుచ్చి గుచ్చి చూస్తూ.

ఆ అమ్మాయి ధోరణి సరదాగానూ, వింతగానూ ఉంది భార్గవకు. "నేనేంవడిగినా మాట్లాడకుండా, వెర్రబ్బాయిలా నావైపు గుడ్లప్పగించి చూస్తారేవిటీ?" అందా అమ్మాయి మళ్ళీ.

"ఏం మాట్లాడమంటావు? అయినా నాకసలు మాట్లాడేందుకవకాశమిస్తేగా నువ్వూ?" అన్నాడు భార్గవ గబగబా. లేకపోతే మరో ప్రశ్న వేస్తుందేమో నన్న భయంతో.

ఏదో గొప్ప విషయాన్ని పరిశోధన చేసి కనిపెట్టిన దానిలా, గుండెల మీద అరచేయి ఉంచుకుని దీర్ఘంగా శ్వాస పీల్చి వదులుతూ అందా అమ్మాయి, "హమ్మయ్య ! మీకు మాటలొచ్చు. మీరు మూగవారు కాదు.

'ఇహ ఇప్పుడు చెప్పండి. ప్రశ్న నంబర్ ఒకటి' - మీ శ్రీమతి గారి నెప్పుడు తీసుకొస్తున్నారు? నంబర్ రెండు... పిల్లలెంతమంది మీకు? నంబర్ మూడు ఎక్కడ పని చేస్తున్నారు? నంబర్ నాలుగూ... మీకు స్కూటరుందా? లేదా కనీసం సైకిలైనా ఉందా? కొత్తదే కానక్కర్లేదు, డొక్కుదైనా ఫర్వాలేదు.

"నంబర్ అయిదు... వారానికెన్ని సినిమాలు చూస్తారు? నంబర్ ఆరు... వీక్లీలూ గట్రా చదివే అలవాటుందా? లేకపోతే మా నాన్నగారిలా న్యూస్‌పేపర్ ముందేసుకుని చెత్త న్యూస్ అంతా చదువుతూ రోజంతా గడిపేస్తారా?"

"అవునూ, మీ ఇంట్లో పెద్దగా సామానేం లేదే?! ఫ్రిజ్ ఏదీ? టీవీ కూడా లేదే? ఎంత వెదికినా డైనింగ్ టేబుల్ కూడా కనిపించదేం? అసలు మీకు జీతంవెంతొస్తుందీ? మర్చే పోయాను అడగడం. మీకు పేకాట, తాగుడు వంటి దరిద్రపు అలవాట్లేమీ లేవుకదా? బహుశః అందుకే ఇంట్లోకేమీ కొనుక్కుని ఉండరు. అవునా?

"మీ ఆవిణ్ణి రానివ్వండి, చెప్తాను మీ పని! అయినా పెళ్ళయ్యాక కూడా అవేం పాడలవాట్లు మీకూ? పెళ్లాం, పిల్లల మొహాలు చూసైనా

మానేయొచ్చు కదా?"

గుక్క తిప్పుకుందుకో క్షణం ఆగిందా అమ్మాయి. భార్గవకామె వేగాన్నందుకొనడం కష్టంగానే ఉంది. అయినప్పటికీ తమాయించుకుని ఏదో చెప్పేందుకు నోరు తెరిచాడు.

ఈలోగా ఓ నడివయసాయన అక్కడికొచ్చి "ఏవనుకోకు బాబూ, చిన్న పిల్ల కదాని గారంగా పెంచాం. కొత్తా పాతా లేదు దీనికి. ఎవరితోనైనా ఇలాగే మాట్లాడుతుంది. నీముందు ఈ పోర్షన్‌లో ఉన్నవాళ్ళు బహుశః దీని ధాటికి తట్టుకోలేకే ఖాళీ చేసుంటారని నా అనుమానం." అంటూ చిరునవ్వు నవ్వాడు.

"రండి... రండి..." అని ఆయనను ఆహ్వానిస్తూ, "మరేం ఫర్వాలేదండీ... నాకిబ్బందేం లేదు. మీ అమ్మాయి వయసులో ఉన్నవారికి ఆ విషయాలు తెలుసుకోవాలనిపించడం సహజం. కాకపోతే సమీర అన్ని విషయాలూ ఒక్కసారే తెల్సుకోవాలని కుతూహల పడుతోందంతే!" అన్నాడు భార్గవ నమ్రతగా.


ఆ అమ్మాయి భార్గవ వైపు మెచ్చుకోలుగా చూసి తిరిగి తండ్రివైపు చూసింది, "చూశారా నేనేవీ తప్పుగా మాట్లాడడం లేదని మీకర్థమైంది కదా!" అన్నట్టుగా. తండ్రీ, భార్గవా మాట్లాడ్తున్నంత సేపూ సమీర మౌనంగా అక్కడే ఉంది, ఇంట్లో నలుమూలలా కలియ తిరుగుతూ. కాస్సేపుండి వెళ్ళిపోయాడాయన.

తిరిగి సమీర తన క్విజ్ కార్యక్రమం కొనసాగించింది.

. . . . .

నెల రోజుల తర్వాత ఓరోజు భార్గవ ఆఫీస్‌కు వెళ్తోండగా దార్లో కనబడిన మిత్రుడతణ్ణి పలకరించి, "ఈమధ్య ఇల్లేమైనా మారావా? సరిగా కనిపించడంలేదూ?" అనడిగాడు.

భార్గవ తన కొత్త ఇంటి గుర్తులు చెప్పాక, "ఆ ఇల్లా? ఆ ఇంట్లో తింగరి పిల్ల ఒకర్తుండాలే!"



అన్నాడేదో ఆలోచిస్తూ.

భార్గవ మనసు చివుక్కుమంది. మిత్రుడి వ్యాఖ్యానానికి. ఈ నెల రోజుల్లోనూ సమీర అతడికి బాగా దగ్గరైంది. ఆమె తల్లిదండ్రులతో కూడా మానసికమైన అనుబంధం ఏర్పడిందతనికి.

"అదేవిటలా అయిపోయావు? ఆ పిల్ల గురించి ఆ లొకాలిటీలో అందరికీ తెల్సు. అమ్మా, నాన్నా అదుపు లేదు. నోటికేదొస్తే అది వాగుతూ, చేతికేదొస్తే అది చేస్తూ ఉంటుంది. ఆ పిల్ల అమ్మా నాన్నా కూడా గట్టిగా మందలించినట్టు కనబడదు. కూతురికి కట్నమిచ్చి పెళ్లి చేసే తాహతు వాళ్లకు లేదు.

"అందుకే కాస్త ఎర్రగా, బుర్రగా ఉన్న నీ బోటి వాళ్లకింట్లో కొంత భాగం అద్దెకిచ్చి, కాగల కార్యం కోసం ఎదురు చూస్తోంటారని చెప్పుకుంటూంటారంతా. నీ జాగ్రత్తలో నువ్వుండు! మరో విషయం అడగడం మర్చేపోయాను. ఆ తింగరి పిల్లకో అక్క ఉండాలి. ఎప్పుడైనా చూశావా నువ్వు? అసూర్యపశ్యలా ఎప్పుడూ ఇంట్లోనే ఉంటుందట. తల చెడి పుట్టింటికి చేరింది కదా మరి!

"చెల్లెల్లా అందరి ముందూ తిరిగితే కొంపలంటుకు పోవూ? వాళ్ల తల్లితండ్రులు కూడా చిన్న పిల్ల కెంత స్వేచ్ఛనిచ్చారో, పెద్ద పిల్లనంత కట్టుదిట్టాల్లో ఉంచుతార్ట! గమనించేవా? ఆ తింగరిదాన్ని చేసుకున్న వాళ్లకా అసూర్యపశ్య బోనస్ అని కూడా చెప్పుకుంటూంటారు జనం. నిజానిజాలు నీకీసరికి తెలిసే ఉండాలి..." అన్నాడతను భార్గవ మొహంలోకి ప్రశ్నార్థకంగా చూస్తూ.

భార్గవకు నోట మాట రాలేదు. ఇతరుల గురించి అంత నీచమైన మాటలు వినడమే పెద్ద పాపమని పించిందతనికి. సమీర తల్లిదండ్రులను చూస్తే ఎంతో ఆప్తుల్ని చూసి నట్టుగా ఉంటుందతనికి. చిన్నప్పటినుంచీ తల్లిదండ్రుల దగ్గరే ఉండడం అలవాటైన తను ప్రస్తుతం ఉద్యోగ రీత్యా వేరే ఊళ్లో ఉంటున్నా, ఆ భావన కలగలేదంటే అందుకు కారణం, వారు చూపించే ఆప్యాయతే!

ఇహ సమీర అక్క ప్రియంవద తనకు కనబడడమే అరుదు. కనిపించిన సందర్భాల్లో ఎప్పుడూ నిర్మలంగా నవ్వుతూనే ఉంటుంది తప్ప ఏనాడూ దిగులుగా కనబడలేదింత వరకూ. అటువంటి కుటుంబం మీద ఇంత ఘోరమైన నింద వేసేందుకు మనసెలా వస్తోందో లోకానికి! అనుకున్నాడు భార్గవ.

అతడి మనసంతా దిగులు ఆవహించింది. ఆఫీస్‌లో అన్యమనస్కంగా గడిపి ఇంటికి చేరుకున్నాడు. బట్టలు మార్చుకుని, పడక కుర్చీలో కూర్చుని కిటికీలోంచి బయటకు చూడసాగాడు.

ఆ కిటికీలోంచి పెరట్లో ఉన్న బావి కనిపిస్తోంది. నూతి చప్టా చుట్టూ గుబురుగా ఉన్న పూల మొక్కలూ, అరటి చెట్లూ, వాటి మధ్య నుంచి కనిపించే నీలి ఆకాశం... ఎంతసేపు చూసినా ఏదో అద్భుతమైన దృశ్యాన్ని చూసినట్టుగా అనిపిస్తుందతడికి.

అలా ఎంతసేపు గడిచిందోగానీ, ఉన్నట్టుండి కళ్ళమీద వెలుతురు పడడంతో ఒక్కసారి కళ్లు మూసి తెరచిన అతడికి గదిలో ప్రియంవద కనిపించింది.

"మీరా?" అని ఆశ్చర్యపోయాడు భార్గవ ఆమెను తన గదిలో చూసి.

సమాధానంగా దరహాసం చిలికించి, "లైటు వేసుకోకుండా కూర్చున్నారేం?" అని తిరిగి వెళ్ల బోయిందామె.

అదే మొదటి సారామె అతడి పోర్షన్‌లోకి రావడం. గతంలో అతడామెతో పెరట్లోనో, వాళ్లింట్లోనో మాట్లాడాడు. ప్రతిసారీ ఆమె తల్లిదండ్రులో, సమీరో ఎవరో దగ్గర ఉండేవారు. ఏకాంతంగా ఆమెతో ఉండడమదే మొదటిసారి.

"ఉండండి. వెళ్లిపోకండి." అంటూ హడావుడిగా పడక కుర్చీలోంచి లేచి ఆమె వైపు నడిచాడు భార్గవ. ఆమె కంగారు పడింది.

"మీరు రావడం చూశాను. ఎంత సేపటికీ ఇంట్లో లైటు వెలగక పోవడంతో లైటు వేద్దామని వచ్చాను." అందామె గబగబా. 'నేను మీ పోర్షన్‌లోకి వేరే ఉద్దేశంతో వచ్చానని అపార్థం చేసుకోకండి సుమా?' అన్నట్టుగా ధ్వనించిందావె గొంతు. "భలేవారే! రాక రాక వచ్చారు. కాస్సేపు కూర్చుని వెళ్లండి. సమీరేదీ కనబడ్డంలేదూ?" అన్నాడు భార్గవ.

"మావయ్యకు ఒంట్లో బావుండలేదని కబురొస్తే అమ్మా, నాన్నగారూ మా అత్తయ్యగారి ఊరు వెళ్లారు. అమ్మా, నాన్నా వద్దన్నా వినకుండా బస్సెక్కించి వస్తానని సమీర కూడా వెళ్లింది." అని "వస్తాను" అందామె.

భార్గవ మరో రెండడుగులు ముందుకు వేసి, "ప్లీజ్ కూర్చోండి." అన్నాడు. ప్రియంవద మొహంలో తొలిసారిగా నవ్వు మాయమైంది. "నేనేమైనా చిన్నపిల్ల ననుకున్నారా, మీ ఎదురుగా కూర్చుని కబుర్లు చెప్పేందుకు?" అందామె చిరు కోపంగా చూస్తూ.

భార్గవ ఆమె మాటలకు నొచ్చుకున్నాడు. "అబ్బే... నా ఉద్దేశం అదికాదు. మీతో ఎప్పుడూ సరిగా మాట్లాడే అవకాశమే రాలేదు నాకు. ఇప్పుడెలాగూ ఇంట్లో ఎవరూ లేరు కదాని కాస్సేపు కూర్చోమన్నానంతే!" అన్నాడు భార్గవ.

ప్రియంవద ఇబ్బందిగా చూసింది.

కాస్సేపాగి, "ఎప్పటి నుంచో అడగాలను కుంటున్నాను. నామీద మీ అభిప్రాయమేమిటి? మీకిష్టమైతేనే చెప్పండి." అన్నాడు భార్గవ.

చివ్వున తలెత్తి చూసిందామె. ఒక మగవాడు పరాయి ఆడదాన్ని ఏ సందర్భంలో, ఎటువంటి విషయానికి ఉపోద్ఘాతంలా ఆ ప్రశ్నడుగుతాడో తెలియని ముగ్ధ కాదామె. పెళ్లయి భర్తతో మూడేళ్ల అన్యోన్యంగా కాపురం చేసి విధివశాన విధవగా మారిన ప్రియంవదకు అతడి ప్రశ్న తనేదో ప్రమాదకర స్థితి అంచున ఉన్న భావనను కలగ చేసింది.ఆమె ఏమీ మాట్లాడక పోవడంతో, "సరే, నా గురించి మంచిగా కాకపోయినా చెడుగా మాత్రం అనుకోవడం లేదని నేననుకుంటున్నాను." అన్నాడు భార్గవ మళ్ళీ.


"ఊహూఁ హాస్యానిక్కూడా అటువంటి మాటలు దయచేసి అనవద్దు. మా చెల్లీ అమ్మా, నాన్నా మీ గురించి మంచిగా చెప్తోంటే నేనెంత పొంగిపోతానో మీకు తెలియదు. అటువంటప్పుడు మీ గురించి 'చెడ్డవారుకాద'ని అనుకోవడం కంటే ఘోరం మరొహటుండదు. ఏ స్త్రీ అయినా..." అప్రయత్నంగా అని నాలుక కరుచుకుంది ప్రియంవద.

"ఊ... ఏ స్త్రీ అయినా..." ప్రాంప్టింగ్ అందించాడు భార్గవ.

"ఇహనే చెప్పను." అంది ప్రియంవద మొండిగా.

"సరే నేనే చెప్తాను. ఏ స్త్రీ అయినా ఇటువంటి మనిషి నీడలో మనుగడ సాగించడమెంత దుర్భరమో అనుకుంటుంది కదూ?" అన్నాడు భార్గవ.

ప్రియంవద రోషంగా అంది, "ఏంకాదు... నానోటితో చెప్పించాలని ఎత్తు వేస్తున్నారు. నాకు తెలియదనుకోకండి."



"నామనసింత బాగా తెలిసినవారు నన్నింకా ఏడిపించడమెందుకూ?" అన్నాడు భార్గవ కవ్విస్తూ.

"ఏవిటి తెలిసేదీ నా మొహం? మీ గురించీ మీ మనసు గురించీ నాకేం తెలియదు. అయినా తెల్సుకోవాల్సిన అవసరం మాత్రం నాకేముంది గనక!" అంది ప్రియంవద.

"అంతేనా? నా మనసులో ఏం ఉందో తెల్సుకుంటే మీకు నిజంగా సంతోషం కలగదా?' ' అన్నాడు భార్గవ దీనంగా మొహం పెట్టి.

మగాడి పొగడ్తలకు పొంగిపోవడం, దీనమైన చూపులకు కరిగి పోవడం స్త్రీల సహజ గుణాలని ఏ మహానుభావులన్నారోగానీ, భార్గవ అలా అనగానే ప్రియంవద గొంతులోకి మార్దవం తోసుకొచ్చింది.

"ఈ విషయమై మనమెన్నడూ మాట్లాడుకోక పోయినా, మీ మనసులో ఏం ఉందో నాకు తెల్సునని మీకు తెల్సు. ఇద్దరి మనసుల్లోనూ ఒకే రకమైన భావన కలిగినపుడు, దాన్ని పైకి వ్యక్తం చేయకపోయినా ఇరువురికీ ఆ విషయం తెలుస్తుందని మీకు తెల్సు. కనుక దాగుడు మూతలు మానేసి మీ మనసులోని మాట నిర్భయంగా చెప్పండి" అంది ప్రియంవద.

భార్గవ నిట్టూర్చి అన్నాడు, "సమీర పెళ్లి గురించి ఏమైనా ఆలోచించారా?"

ఆ ప్రస్తావనతడి నుంచి ఆశించక పోవడంతో ఒక్కక్షణం తెల్లబోయింది ప్రియంవద. అతడడగ దలచుకున్న విషయమది కాదని అనిపించినా తన భావాల్ని మనసులోనే అదిమి పడుతూ, "ఇందులో ఆలోచించేందుకేఁవుందీ? వచ్చే ఏడాదితో డిగ్రీ పూర్తవుతుంది దానికి. ఎవరో మంచి కుర్రాణ్ణి చూసి ముడి పెట్టడమే." అంది ప్రియంవద.

"అదే ఆ 'ఎవరో' ఎవరనే విషయం నిశ్చయమైందా? అని నా ప్రశ్న." అన్నాడు భార్గవ.

"మా ఇంటి విషయాలు మీకు తెలియనివేమున్నాయి? మేమిచ్చే డబ్బుకాశించి ఎవరూ వస్తారని మాకు ఆశ లేదు. సమీర అందాన్నీ, గుణగణాల్నీ చూసి ఎవరైనా రాజకుమారుడు వెదుక్కుంటూ రాకపోతాడా? అని ఆశ అంతే!" అని నవ్వి, "మీ దృష్టిలో ఎవరైనా ఉంటే చెబ్దురూ! మా ఇంటిల్లిపాదీ మీకు ఋణపడి ఉంటాం." అంది ప్రియంవద.

భార్గవ కళ్లెగరేసి అన్నాడు, "మీ నాన్నగారీ మాట నాకెప్పుడో చెప్పారు. మీరింకేదైనా కొత్త విషయం చెప్తారేమోనని అడిగాను."


"ఇంట్లో పడుండే దానికంతకంటే విషయాలేం తెలుస్తాయి? కానీ ఒక్కటి మాత్రం నిజం. మీరు మరోలా అనుకోవద్దు. 'భార్గవ వంటి కుర్రాడితో సమీరకు పెళ్లయితో ఎంత బావుంటుందో కదా!' అని అమ్మా నాన్నా చాలా సార్లనుకోవడం నాకు తెలుసు." అని తలదించుకుంది ప్రియంవద.

"అంటే మీ అమ్మానాన్నల కళ్లకు నేను రాజకుమారుడిలా కనబడ్డానంటారా?" అన్నాడు భార్గవ.

"రాజ కుమారుడే కర్మ! సాక్షాత్తూ రాజాధి రాజులానే కనిపించి ఉంటారు. సమీరకు మీరంటే చాలా ఇష్టం. ఎప్పుడూ ఇంట్లో మీ గురించి పొగడ్డం తప్ప మరో పనిలేదు దానికి. పది మాటలు మాట్లాడితే అందులో ఏడెనిమిది మాటలు మీ గురించే అయి ఉంటాయి." అంది ప్రియంవద తల ఎత్తకుండానే.

"మరి మీ అమ్మగారు గానీ, నాన్నగారు గానీ నా దగ్గరెన్నడూ అటువంటి ప్రస్తావన తేలేదేం?" అన్నాడు భార్గవ.

"మా నాన్నగారు మీతో సమీరకు వరుణ్ణి చూడమని చెప్పారన్నారు కదా! ఓ ఆడపిల్ల తండ్రి, తనభిమానించే వయసులో ఉన్న ఓ పెళ్లికాని కుర్రాడితో అంతకంటే సూటిగా తన అభిప్రాయాన్నెలా చెప్పగలడు?" అంది ప్రియంవద.




ఆ మాటలన్నపుడు అప్రయత్నంగా ఆమె కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి.

లైటు వెలుతుర్లో కన్నీటి తడికి మిలమిలా మెరుస్తోన్న ఆమె కళ్లను చూసి చలించి పోయాడు భార్గవ.

"సారీ... సో... సారీ... మిమ్మల్ననవసరంగా ఏడిపించా."

"లేదు... ఇందులో మీరు నన్ను బాధించిందేమీ లేదు. నేను చూస్తే తల చెడి పుట్టింటికి చేరాను. సమీరకు పెళ్లి వయసొచ్చేసింది. మా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం. ఏమాత్రం జరుగుబాటు ఉన్న వాళ్లైనా వయసులో ఉన్న ఆడపిల్లలిద్దర్నింట్లో ఉంచుకుని ఓ బ్రహ్మచారికి ఇల్లద్దెకిచ్చే సాహసం చేస్తారా ఈ రోజుల్లో?

"అంతేకాదు. కూతురికి పెళ్లి చేసే స్తోమతు లేకే, బ్రహ్మచారులకిల్లు అద్దెకిచ్చి వాళ్లకు వల వేస్తోంటాడని మా నాన్నగారి గురించి చుట్టు పక్కల వాళ్లు చెప్పుకుంటూంటారని కూడా మాకు తెలుసు. అయి మీరిచ్చే రెండు వందలూ మా కుటుంబం గడచేందుకు తప్పని సరి కాబట్టి మేమేనాడూ ఇరుగు పొరుగుల మాటల్ని పట్టించుకోలేదు. పట్టించుకుంటే మా కడుపులే కాల్తాయనే స్వార్థమే అందుకు కారణం." అంది ప్రియంవద.

ఆమె మాటలు పూర్తయేసరికి కన్నీళ్లామె కళ్లలో సుళ్లు తిరిగి, కనురెప్పల్ని దాటుకుని చెక్కిళ్ల మీదకు ప్రవహించాయి. పరిస్థితిలా మారిపోయేసరికి భార్గవ కళ్లు అప్రయత్నంగానే చెమ్మగిల్లాయి. ఒకడుగు ముందుకు వేసి ఆమె కన్నీళ్లు తుడిచే ప్రయత్నం చేయబోయాడు.

ఆమె మొహం పక్కకు తిప్పుకుని, మోచేతిని వెనక్కి తిప్పి కన్నీళ్లు తుడుచుకుంటూ, "పోనివ్వండి, ఇదంతా ఎందుగ్గానీ చెప్పండి. మీరు మా సమీరను చేసుకుంటారా?" అంది సూటిగా. భార్గవ ఒక్క క్షణం నిరుత్తరుడయ్యాడు. అతడేమీ మాట్లాడక పోవడం గమనించి తిరిగి ప్రియంవదే అంది, "మీ సమాధానం ఎలా ఉన్నా మేం చేయగలిగిందేమీ లేదు. మేం బాధ పడతామని మాత్రం ఒప్పుకోవద్దు. మనఃస్ఫూర్తిగా మీకిష్టమైతేనే చెప్పండి."

భార్గవ సమాధానం చెప్పేందుకు కొంచెం సమయం తీసుకున్నాడు.

"ప్రియంవదగారూ... నేను చెప్పేది సావధానంగా వినండి. ఆవేశపడి కోపం తెచ్చుకోకండి. సమీరనెప్పుడూ నేనా దృష్టితో చూడలేదు. అదిగో మీక్కోపం వాస్తోంది. 'అటువంటి ఉద్దేశం లేనపుడా పిల్లతో ఎందుకంత చనువుగా ఉండి ఆశలు రేపారు?' అని అడిగేందుకప్పుడే సిద్ధమై పోయారు... ఆగండి... నేను చెప్పేది పూర్తిగా వినండి.

"సమీర నా కళ్లకు చిన్నపిల్లలానే కనిపిస్తుందిప్పటికీ. సమీరతో గంటల తరబడి మాట్లాడినా, సినిమాకెళ్లినా, షికారు కెళ్లినా, ఓ అభమూ శుభమూ తెలియని అమాయకురాలితో గడిపినట్టుగానే ఉంటుంది తప్ప కాబోయే జీవిత భాగస్వామితో ప్రవర్తించినట్టుగా ఉండదు.

"ఆ విషయాన్నలా ఉంచితే, మీ గురించి ఆలోచించినపుడల్లా నాకు సరిగా నిద్ర పట్టేది కాదు. మరోలా అనుకోకండి. మీకూ నాకూ ఒకటి

## వృత్తుల్లో హాస్యోక్తులు

### అధ్యక్షుడు - అధ్యక్షురాలు

పత్రికా ప్రతినిధులు ఒక్కొక్క సారి ఏదైనా ఒక కార్యక్రమానికి హాజరు కాలేక పోయి, ఆ కార్యక్రమానికి సంబంధించిన వార్తను హాజరైన తోటి రిపోర్టరు దగ్గర నుంచి సేకరించి దాన్ని తాము ప్రాతినిధ్యం వహించే పత్రికకు రాయడం పరిపాటి. అయితే వారు ప్రత్యక్షంగా కార్యక్రమాన్ని చూడకుండా కేవలం సహచరుడు అందించిన (సాధారణంగా ఆంగ్లంలో ఉండే) ప్రెస్ నోట్ కాపీని ఆధారం చేసుకుని రాసే వార్తల్లో దొర్లే పొరపాట్లు ఒక్కొక్కసారి హాస్యాన్ని పుట్టిస్తాయి.

ఈ మధ్య రైల్వే యాజమాన్యం ఆధ్వర్యంలో బాలల వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాలకు పత్రికల వారిని ఆహ్వానించి వాటి ప్రాచుర్యానికి బాధ్యత వహించడం ప్రజా సంబంధాల శాఖ అధికారుల పనుల్లో ఒకటి. అందుకని ఈ శిబిర ప్రారంభోత్సవానికి కూడా పత్రికల వారిని పిలవగా, కొందరు ప్రతినిధులు హాజరై ఆ వార్తను వారి వారి పత్రికలలో ప్రచురించారు. అయితే ఈ శిబిర ప్రారంభోత్సవానికి సంబంధించిన వార్త ఈ కింది విధంగా ప్రచురించాడు, కార్యక్రమానికి హాజరు కాని ఒక ప్రముఖ దిన పత్రికా ప్రతినిధి.

"దక్షిణ మధ్య రైల్వే క్రీడా విభాగం అధ్యక్షురాలు జె.ఆర్.జ్యోతి మాట్లాడుతూ క్రీడలు మనిషికి ఎంతో అవసరమని, ఆరోగ్యానికి, మనో వికాసానికి ఇవి దోహద పడతాయని అన్నారు. శిబిరంలోని శిక్షకులకు తమ విలువైన సలహాలు అందించాల్సిందిగా ఆమె కోరారు. దేశాభివృద్ధికి, దేశ కీర్తి ప్రతిష్ఠకు విద్యార్థినీ విద్యార్థులకు ఆటలు ఎంతో ఉపకరిస్తాయని ఆమె చెప్పారు."

అయితే శ్రీ జె.ఆర్. జ్యోతి అనే వ్యక్తి రైల్వే క్రీడా విభాగం 'అధ్యక్షుడు' కాని అధ్యక్షురాలు కాదు. వార్త రాయాలన్న ఆతురతతో, వివరాలు సరిగ్గా తెలుసుకోకుండా పేరు 'జ్యోతి' అని ఉంది కదా, తప్పక ఆ వ్యక్తి స్త్రీ అయి ఉంటుందని ఊహించుకుని హాజరు కాని ప్రతినిధి రాసిన ఈ వార్త గురించి రైల్వేలో ఉన్నతాధికారి అయిన ఆ 'జ్యోతి'గారు ప్రస్తావించినపుడు నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదు!

**అనిపెద్ది వెంకట రమణరావు**
(సికింద్రాబాద్)

రెండేళ్ల కంటే తేడా ఉండక పోవచ్చు. కానీ సమీరకు పెళ్లై బయటకు వెళ్లిపోతే తరవాత మీ పరిస్థితి ఏమిటనే విషయం ఆలోచించినపుడల్లా నా మనసెంతో వేదనకు గురయ్యేది.

"చిన్నవయసులో భర్తను పోగొట్టుకున్న దురదృష్టానికి మీ శేష జీవితమంతా ఇలా ఏ స్పందనా లేకుండా గడిచి పోవడమేనా? అనే ఆలోచన వచ్చినపుడల్లా నాకు చాలా బాధగా అనిపించేది. ఎన్నో నిద్రలేని రాత్రులలా ఆలోచించాక ఓ పరిష్కారం స్ఫురించింది నాకు...' ' అని ఆగాడు భార్గవ.

ప్రియంవద గుండెలతివేగంగా కొట్టుకున్నాయి.

"నేను చెప్పే విషయం మీకు నచ్చుతుందో లేదో? మీ తల్లిదండ్రులే విధంగా భావిస్తారో అని సంకోచంగానే ఉందిప్పటికీ. అయినప్పటికీ నా మనసులోని మాట చెప్తాను. దయచేసి సహృదయంతో ఆలోచించండి.

"మీ గుణగణాలు నాకు నచ్చాయి. అంటే సమీర గుణగణాలు నాకు నచ్చలేదనే అభిప్రాయానికి రావద్దని మనవి. సమీర మీకంటే అందమైనదే! కాదనను. ఆమె అందం గలగలా పారే సెలయేటి వంటిదైతే, మీ అందం నిశ్చలమైన పవిత్ర తటాకంతో పోల్చదగ్గది. ముఖ స్తుతి కోసం ఈ మాటలనడం లేదు నేను.

"ఇవన్నీ అలా ఉంచితే... మిమ్మల్ని నేను వివాహం చేసుకుంటే సమీరకు మంచి వరుణ్ణి చూసి ఎంపిక చేయడం నా ప్రధాన బాధ్యత అవుతుంది. అది నాకెంతో ఆనందం కలిగించే విషయం. మీ మీది జాలితోనో, విధవా వివాహం చేసుకున్న సంస్కర్తగా కీర్తింపబడాలనే కోరికతోనో ఈ నిర్ణయానికి రాలేదు నేను.

"సమీరకెలా అయినా పెళ్లవుతుంది. నేను కాకపోతే మరొకరు సాయం చేస్తారు. కానీ ఎంతో ప్రయత్నం చేసి అన్నీ కలిసొస్తేనేగానీ మీ జీవితం తిరిగి మామూలుగా అయ్యే అవకాశం లేదు.

"ఇందులో నా స్వార్థం కూడా లేకపోలేదు. మా అక్కయ్య నాకంటే పదిహేనేళ్లు పెద్దది. నాకు ఊహ వచ్చేనాటికే భర్తను పోగొట్టుకుని పుట్టింటికి చేరుకుంది. మా అమ్మా, నాన్నా ఏ లోటూ రాకుండా బాగానే చూసుకున్నా, మా అన్నయ్యలకు పెళ్లిళ్లయ్యాక ఆవిడ పరిస్థితి పని మనిషి స్థాయికి దిగజారింది.

"మా అమ్మా నాన్నా బ్రతికున్నంత వరకూ పర్వాలేదు. తర్వాతెవరు చూస్తారు మా అక్కను? నాకు కాబోయే భార్య మాత్రం మా వదినల్లా ప్రవర్తించదని నమ్మకమేముంది? మా అక్కయ్య నెప్పుడు చూసినా ఆవే ఆలోచనలు నాకు. మీరు నా అర్ధాంగి అయితే మా అక్కయ్యను సాదరంగా చూస్తారని నా ఆశ. నేను చాలా స్వార్థపరుడిలా కనిపిస్తున్నానా?

"మళ్లీ చెప్తున్నాను. మీమీద జాలితో ఈ ప్రతిపాదన చేయడం లేదు నేను. మీరు నాకు నచ్చారు. మీరు విధవ అనే విషయం తర్వాతిది. నాది నిస్సందేహంగా స్వార్థమే! కానీ ఇతరులకది ఆదర్శంగా అనిపించవచ్చు. ఆదర్శమనేది నా స్వార్థానికి కప్పిన ముసుగు మాత్రమే!

"సహధర్మచారిణితో కలకాలం సలక్షణంగా కాపురం చేయాలంటే ఎటువంటి ముసుగులూ అడ్డుండకూడదు. కాబట్టి బాహ్య ప్రపంచానికి కనిపించే ఆదర్శపు ముసుగులోని నా అసలు రూపాన్ని మీ ముందుంచుతున్నాను.

"స్వార్థానికీ, ఆదర్శానికీ పొత్తు కుదరదు. రెండూ వేర్వేరు అసంబద్ధమైన విషయాలు. అందుకే మీరు విధవ కాబట్టే మిమ్మల్ని చేసుకోదలచుకున్నానని అనడమూ, మీరు నాకు నచ్చారు కాబట్టి చేసుకోవాలను కుంటున్నానని అనడమూ ఈ రెండూ పరస్పర విరుద్ధమైన విషయాలని మీకు అనిపించడంలో తప్పేమీ లేదు.

"నిస్వార్థంగా విధవలనుద్ధరించేందుకు ముందుకొచ్చే వారితో పోలిస్తే నేనల్పుడినే అయినా, నా ఈ స్వార్థం వలన సమాజానికి లాభం ఉన్నా లేకపోయినా నష్టం మాత్రం లేదని నా నమ్మకం. కాదంటారా? ఈ లోకంలోని మగవారందరూ విధవల్ని వివాహం చేసుకుందుకు ముందుకు రాకపోయినా, విధవలైన తోబుట్టువులున్న నాలాంటి మగవాళ్లు కనీసం స్వార్థంతోనైనా ముందుకు వస్తే మున్ముందు కాలక్రమేణా ఆశించిన ప్రగతి దానంతటదే వస్తుందని నా విశ్వాసం.

"నా ప్రతిపాదనను తిరస్కరించినా, స్వీకరించినా అంతా మీ చేతుల్లోనే ఉంది. మీరు నన్ను చేసుకుందుకొప్పుకోనంత మాత్రాన, సమీరను మర్చిపోతానని అనుకోవద్దు. మి నిర్ణయమెలా ఉన్నప్పటికీ సమీరకు మంచి వరుణ్ణి చూసి పెళ్లి జరిపించే బాధ్యతను సంతోషంగా నిర్వర్తిస్తానని మీకు మాట ఇస్తున్నాను.

కానీ మీరిలా ఈ స్థితిలోనే ఎల్లకాలమూ ఉంటే మాత్రం నేను ఖచ్చితంగా బాధ పడతాను. బాధ పడడమే కాదు, నేనూ భార్యలేని వాడిలా ఇలానే ఉండిపోతాను తప్ప నా స్వార్థం కోసం మరో విధవను కట్టుకునే ప్రయత్నం మాత్రం చేయను. ఇది బెదిరింపు కాదని మనవి." అన్నాడు భార్గవ.

ప్రియంవద చాలాసేపు మాట్లాడలేదు.

కాసేపటికి నీళ్లు చిప్పిల్లిన కళ్లతో తలెత్తి ఏదో అనబోతోండగా, సమీర సుడిగాలిలా లోపలికి దూసుకు వచ్చి, చప్పట్లు చరుస్తూ, 'సెహబాష్ బావగారూ! మీ ఆదర్శానికి అభినందిస్తున్నాను. నాకంటే మా అక్కయ్యే మీకు నచ్చినందుకు నాకు చాలా అసూయగా ఉంది కూడా! రేపు సాయంత్రం అమ్మా నాన్నా వచ్చాక ఈ వార్త విని ఎంత సంతోషిస్తారో!" అంటూ చిన్న పిల్లలా గంతులేస్తూ, ఓ చేత్తో భార్గవ చేతినీ, మరో చేత్తో ప్రియంవద చేతినీ పట్టుకుని, "అక్కయ్య పెళ్లి కూతురాయెనే!' ' అంటూ గిరగిరా తిరగ సాగింది